సాక్షి
అనకాపల్లి

శనివారం । 21 । జనవరి । 2023



పాఠశాలల అభివృద్ధి II లో

కలెక్టర్ పాయకరావుపేటలోని ప్రభుత్వ హైస్కూల్‌ను తనిఖీ చేశారు. నాడు–నేడులో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు.



తిరిగిరాని లోకాలకు.. II లో

తాతయ్య సంవత్సరీకానికి వచ్చిన ఓ బాలుడు ప్రమాదవశాత్తూ నీటి మునిగి ప్రాణాలు కోల్పోయాడు.

వాతావరణం

అనకాపల్లి టౌన్: రాగల అయిదు రోజులు ఆకాశం మేఘావృతమై ఉంటుందని అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం వాతావరణ విభాగం శాస్త్రవేత్త ఎంజీజీఎస్ కుమారి పేర్కొన్నారు. ఉష్ణోగ్రతలు 29.6 నుంచి 29.8 డిగ్రీలు, తేమ 81 నుంచి 83 శాతం, గాలి గంటకు 4 కిలోమీటర్ల వేగంతో వీస్తుందన్నారు.

న్యూస్‌రీల్

కానిస్టేబుళ్ల ప్రిలిమినరీ పరీక్ష రేపు

- జిల్లాలో 21 పరీక్షా కేంద్రాలు
- 9,897 మంది అభ్యర్థులు



చల్లా నర్సింహం

అనకాపల్లిటౌన్ : పోలీస్ కానిస్టేబుల్ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు సకాలంలో ఆయా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని పోలీస్ ఎగ్జామినేషన్స్ రీజనల్ కోఆర్డినేటర్, డైట్ ప్రిన్సిపాల్ చల్లా నర్సింహం సూచించారు. కళాశాల ఆవరణలో శుక్రవారం విలేకర్లతో ఆయన మాట్లాడారు. ఈ నెల 22న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష ఉంటుందన్నారు. నిర్దేశిత సమయానికి ఒక్క నిముషం ఆలస్యమైనా అనుమతించేది లేదన్నారు. ప్రిలిమినరీ పరీక్షకు 9,897 మంది దరఖాస్తు చేసుకున్నట్టు తెలిపారు. ఇందులో మహిళలు 2,781 మంది ఉన్నట్టు పేర్కొన్నారు. వీరి కోసం జిల్లాలో మొత్తం 21 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. అనకాపల్లిలో 11, చోడవరంలో 5, మునగపాకలో 2, అచ్యుతాపురంలో 2, మాకవరపాలెంలోని ఒక కేంద్రంలో పరీక్ష జరగనుందన్నారు. పరీక్షల నిర్వహణకు 25 మంది పరిశీలకులు, 21 మంది పర్యవేక్షకులను నియమించినట్టు ఆయన తెలిపారు.

స్టోన్ క్రషర్‌పై ప్రజాభిప్రాయ సేకరణ



ప్రజాభిప్రాయ సేకరణలో మాట్లాడుతున్న డీఆర్వో వెంకటరమణ

అనకాపల్లిటౌన్ : మండలంలోని బవులవాడ గ్రామం సర్వే నెం.75లో ఉన్న 13.77 హెక్టార్లలో వెంకటశ్రీ స్టోన్‌క్రషర్ ఏర్పాటుపై శుక్రవారం ప్రజాభిప్రాయ సేకరణ జరిగింది. ఈ కార్యక్రమానికి పరిశీలకులుగా డీఆర్వో వెంకటరమణ, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ వెంకటేశ్వర్లు హాజరయ్యారు. గ్రామస్తులు మాట్లాడుతూ స్థానిక నిరుద్యోగులకు పూర్తిస్థాయిలో ఉపాధి అవకాశాలు కల్పించాలని, దుమ్ము, ధూళి రాకుండా వేప, రావి తదితర మొక్కలు నాటాలని కోరారు. గ్రామంలో మూడు నెలలకోసారి వైద్యశిబిరం ఏర్పాటు చేసి, ఉచిత వైద్య పరీక్షలతోపాటు, మందులు అందించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ గంగాధరరావు, క్రషర్ యాజమాన్యం, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతులు



బాబ్జీ సుబ్రహ్మణ్యశాస్త్రి వి.వి.రమణ

మునగపాక/నక్కపల్లి/నర్సీపట్నం: జిల్లాలో పలువురు తహసీల్దార్లకు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతులు లభించాయి. మునగపాక తహసీల్దార్ బాబ్జీ విజయనగరం జిల్లా సెట్విస్ సీఈవోగా నియమితులయ్యారు. నక్కపల్లి తహసీల్దార్ సుబ్రహ్మణ్యశాస్త్రికి అల్లూరి జిల్లా రంపచోడవరం ఐటీడీఏ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి లభించింది. ఆరుమాసాల క్రితం శాస్త్రి నక్కపల్లి తహసీల్దార్‌గా నియమితులయ్యారు. నర్సీపట్నం తహసీల్దార్ వి.వి.రమణను పదోన్నతిపై కూనవరం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా బదిలీ చేశారు. ఇంకా ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ పీఏ‌గా డిప్యూటీ కలెక్టర్ క్యాడర్‌లో పి.కృష్ణమూర్తి, బీజేఆర్ సుజల స్రవంతి ప్రాజెక్టు (అనకాపల్లి) స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా కె.రమామణి నియమితులయ్యారు.

కలకలం

సమయం శుక్రవారం మధ్యాహ్నం 12.30 గంటలు.. అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు బిలబిలమంటూ తహసీల్దార్ కార్యాలయంలో ప్రవేశించారు.. అన్ని వైపులా తలుపులు మూసి తనిఖీలు ప్రారంభించారు.. ఈ హఠాత్ పరిణామంతో రెవెన్యూ సిబ్బంది బిత్తరపోయారు.. ఉద్యోగుల వద్ద ఎంత సొమ్ము ఉందో పరిశీలించగా ఒకరి వద్ద అత్యధికంగా రూ.11,264 లభించింది. ఆ మొత్తాన్ని ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.. రాత్రి పొద్దుపోయేవరకు తనిఖీలు కొనసాగాయి.



వివరాలు వెల్లడిస్తున్న ఏసీబీ అదనపు ఎస్పీ శ్రావణి

- రోలుగుంట తహసీల్దార్ కార్యాలయంలో ఏసీబీ తనిఖీలు
- అవినీతి ఆరోపణలు రావడంతో 23మంది అధికారులతో దాడి
- కార్యాలయం తలుపులు మూసి రికార్డుల పరిశీలన
- సిబ్బందిలో ఒకరి వద్ద రూ.11,264 స్వాధీనం
- ఇద్దరు ప్రైవేటు వ్యక్తులతో సొమ్ము వసూలు చేస్తున్నట్టు గుర్తింపు



తహసీల్దార్ కార్యాలయంలో సోదా చేస్తున్న ఏసీబీ సిబ్బంది.



తహసీల్దార్ కార్యాలయం గేటు మూసి కాపలా ఉన్న ఏసీబీ సిబ్బంది

రోలుగుంట: టోల్ ఫ్రీ నంబర్ 14400.. ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి నిరోధానికి రాష్ట్ర సర్కారు ఏర్పాటు చేసిన ఫోన్ నంబర్ అది.. రోలుగుంట తహసీల్దార్ కార్యాలయంలో అవకతవకలు జరుగుతున్నట్టు పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు రావడంతో ఉమ్మడి విశాఖ జిల్లా ఏసీబీ అడిషనల్ ఎస్పీ కె.శ్రావణి నేతృత్వంలో 23మందితో కూడిన బృందం తనిఖీలు చేసింది. తహసీల్దార్ వెంకటేశ్వరరావు, డిప్యూటీ తహసీల్దార్ హెచ్.త్రివేణి, ఆర్ఐ నరేంద్ర గదుల్లో రికార్డులను వీరు పరిశీలించారు. ఆన్‌లైన్లో నిక్షిప్తమైన సమాచారాన్ని కూడా తెలుసుకున్నారు. వివిధ పనుల కోసం ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను, ముఖ్యంగా చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించినట్టు సమాచారం. సాయంత్రం 6.30 గంటల ప్రాంతంలో అడిషనల్ ఎస్పీ కె.శ్రావణి విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఇద్దరు ప్రైవేటు వ్యక్తుల ద్వారా వివిధ పనుల కోసం వచ్చే వారి నుంచి నగదు వసూలుకు పాల్పడుతున్నట్టు తెలిసిందని ఆమె చెప్పారు.

అవినీతి ఆరోపణలపై రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా ఉందని, 14400 టోల్ ఫ్రీ నంబరుకు ఫిర్యాదు వస్తే తక్షణం స్పందించాలని తమకు ఆదేశాలున్నాయని చెప్పారు. తమ దృష్టికి వచ్చిన ప్రతి ఫిర్యాదుకు సంబంధించిన వివరాలను నిశితంగా పరిశీలిస్తున్నామని చెప్పారు. పనులు చేసేందుకు డబ్బులు అడిగితే టోల్ ఫ్రీ నంబరుకు ఫిర్యాదు చేయాలన్నారు. తనిఖీలు రాత్రి 11.30 గంటలకు వరకు సాగాయి. సోదాల్లో ఏసీబీ సీఐలు ప్రేమ్‌కుమార్, కిశోర్‌కుమార్, విజయ్, శ్రీనివాస్, ఎస్ఐ మనోజ్‌కుమార్, హెచ్‌సీలు, పీసీలు పాల్గొన్నారు.

క్షేమంగా వెళ్లి రండి..



ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, ఎస్పీ గౌతమి సాలి

- రహదారి భద్రత నియమాలు పాటిస్తే ప్రమాదాలకు తావే లేదు
- వారోత్సవాల ప్రారంభ ర్యాలీని ప్రారంభించిన కలెక్టర్, ఎస్పీ

అనకాపల్లి టౌన్: జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసు, రవాణా శాఖలు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నాయని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా స్థానిక రింగ్‌రోడ్డు కూడలి వద్ద జిల్లా రవాణాశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతేడాది జిల్లాలో 40 శాతం రోడ్డు ప్రమాదాలు జరిగాయని, ఈ ఏడాది జీరో స్థాయికి తగ్గేలా కృషి చేస్తామన్నారు. పోలీసు, రవాణాశాఖ ఆధ్వర్యంలో పలు విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. ప్రజలందరూ రహదారి నియమ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. రహదారులపై ప్రయాణించే సమయంలో ప్రజలందరూ పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ ర్యాలీ నెహ్రూచౌక్ కూడలి వరకు సాగింది. ఎస్పీ గౌతమి సాలి మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలు నడిపేవారందరూ హెల్మెట్లు ధరించాలన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ ఉద్యోగులు ఈ విషయంలో ఆదర్శంగా మెలగాలన్నారు. యువత ఎక్కువగా రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారని, దీనిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. జిల్లా రవాణా శాఖాధికారి వీర్రాజు మాట్లాడుతూ సెల్‌ఫోన్ డ్రైవింగ్ వల్ల ప్రమాదాలు ఎక్కువగా సంభవిస్తున్నాయని, ప్రధాన కూడళ్లలో వాహనదారులకు ఎప్పటికప్పుడు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్టు పేర్కొన్నారు. పరిమితికి మించి వేగంతో నడపడం వలన ప్రమాదాలు జరుగుతున్నాయని, స్పీడ్‌గన్ ఉపయోగించి వేగంపై నిఘా పెంచుతామన్నారు. అడిషనల్ ఎస్పీలు విజయభాస్కర్, సత్యనారాయణ, డీఎం హెచ్‌వో హేమంత్, డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి, వెహికల్ ఇన్‌స్పెక్టర్లు ప్రకాష్, రాజన్న, మురళీకృష్ణ, శివరాం గోపాల్, వెంకటరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వలంటీర్లంటే ఎందుకంత ద్వేషం?

- ప్రజలకు సేవలందిస్తున్న వారిని తూలనాడుతారా?
- దేశవ్యాప్తంగా వలంటీర్ వ్యవస్థకు ప్రశంసలు
- పచ్చమీడియా విషపు రాతలు మానుకోవాలి
- జన్మభూమి కమిటీల ఆగడాలను ఆనాడు ఎందుకు ప్రశ్నించలేదు
- డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు



దేవరాపల్లి: దేశంలోనే ఆదర్శంగా సేవలందిస్తున్న వలంటీర్ వ్యవస్థను చూసి టీడీపీ ఎందుకు వణికిపోతుందో అర్థం కావడం లేదని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు ధ్వజమెత్తారు. వలంటీర్ వ్యవస్థపై ఈనాడు సహా పచ్చ మీడియా విషపు రాతలను, టీడీపీ నేతల విమర్శలను ఆయన తీవ్రంగా ఖండించారు. రైవాడ అతిథి గృహంలో శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. వలంటీర్లు ప్రజా సేవే పరమావధిగా నామమాత్రపు పారితోషికంతో పనిచేస్తున్నారన్నారు. ప్రజలు పడిగాపులు కాసే పరిస్థితి లేకుండా పింఛన్లు సహా అన్ని సేవలను తలుపు తట్టి ఇంటి ముంగిటకే అందిస్తున్నారన్నారు. గొప్పగా సేవలందిస్తున్న ఇలాంటి వ్యవస్థ పట్ల పచ్చ గ్యాంగ్ పిచ్చి పట్టి, మతి భ్రమించి మాట్లాడుతున్నారని విమర్శించారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థలతో గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం సాకారానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. ఈ వ్యవస్థల ద్వారానే రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రమాణికంగా టీడీపీ కార్యకర్తలకు సైతం సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. వలంటీర్ల వ్యవస్థను ఆదర్శంగా తీసుకున్న ఇతర రాష్ట్రాలు ఆ దిశగా అడుగులు వేస్తున్నాయన్నారు. కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి వారు అందించిన సేవలు అమోఘమన్నారు. అలాంటి వారిని పచ్చ మీడియా వక్ర కోణంలో చూపించ డాన్ని ప్రజలు చీదరించుకుంటున్నారన్నారు.

జలగల్లా పీక్కుతిన్న జన్మభూమి కమిటీలు

టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీలు ప్రజలను దోపిడీ చేసి జలగల్లా పీక్కుతిన్నాయని ముత్యాలనాయుడు ధ్వజమెత్తారు. ప్రతి పథకం మంజూరుకు లంచాలు వసూలు చేసి గ్రామ స్థాయి నాయకుల నుంచి ఎమ్మెల్యేలు, మంత్రుల వరకు పంచుకుతిన్నారని ఆరోపించారు. ఆనాటి జన్మభూమి కమిటీల అకృత్యాలను పచ్చమీడియా ఎందుకు పత్రికల్లో రాయలేదని ప్రశ్నించారు. తమ పరిపాలనలో అవినీతి జరుగుతున్నట్టు ఎక్కడైనా చూపించగలరా అని సవాల్ విసిరారు. ప్రతి నెల ఒకటో తేదీన సూర్యోదయం కాకముందే ఇంటి వద్దే పింఛన్ అందిస్తున్న వలంటీర్ వ్యవస్థను దేశమంతటా మెచ్చుకుంటే.. దాన్ని రాసేందుకు రామోజీకి చేతులు రాలేదన్నారు. టీడీపీ అడ్రస్ గల్లంతవుతుందన్న భయంతోనే ఇలాంటి తప్పుడు రాతలు రాస్తున్నారన్నారు. టీడీపీ, పచ్చమీడియా ఎన్ని కుట్రలు పన్నినా వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయాన్ని అడ్డుకోలేరని ముత్యాలనాయుడు స్పష్టం చేశారు. సమావేశంలో మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- ప్రధాన వైద్యాధికారి, సిబ్బంది జీతం నిలుపుదలకు ఉత్తర్వులు
- కేజే పురం పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీలో డీఎంహెచ్‌వో హేమంత్



పీహెచ్‌సీ సిబ్బంది, గ్రామ పెద్దలతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ హేమంత్

మాడుగుల రూరల్ : విధుల్లో వైద్యులు, వైద్య సిబ్బంది అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని అనకాపల్లి జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎ.హేమంత్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన కేజేపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరును పరిశీలించారు. ఈ సమయంలో ప్రధాన వైద్యాధికారి ఎల్‌వీఎస్ఎస్ ప్రసాద్‌పాత్రుడు పీహెచ్‌సీలో లేరు. సిబ్బందిని ఆరా తీయగా, ఆయన ఎం.కోడూరు విజిట్‌కు వెళ్లినట్లు మూమెంట్ రిజిస్టర్లో పేర్కొన్నారు. ఆయనతో పాటు ఎంపీహెచ్ఈవో రవికుమార్ కూడా ఉన్నారు. కాగా ఈ నెల్లో ప్రధాన వైద్యాధికారి లీవ్ పెట్టకుండా అటెండెన్స్ రిజిస్టర్లో సంతకాలు పెట్టినట్టు డీఎంహెచ్‌వో గుర్తించారు. అసలు లీవ్ పెట్టకపోవడంతో పాటు, తమ కార్యాలయానికి సమాచారం కూడా ఇవ్వనట్టు తేలడంతో, వెంటనే ఆయనకు మోమో జారీ చేస్తామని, జీతం కూడా నిలుపుదల చేస్తామని పేర్కొన్నారు. వీరితో పాటు ఇతర సిబ్బంది కూడా సక్రమంగా విధులు నిర్వహించట్లేదని, వారి జీతం కూడా నిలుపుదల చేయనున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో హేమంత్ మాట్లాడుతూ ఇక్కడ రెండవ వైద్యాధికారి డిప్యుటేషన్‌పై పాడేరు అదనపు డీఎంహెచ్‌వోగా పనిచేస్తున్నారని, అందువల్ల ఇక్కడ రెండవ వైద్యాధికారిగా అనకాపల్లిలోని తమ కార్యాలయంలో ఉన్న బి.రవితేజను నియమించనున్నట్టు వెల్లడించారు. ఈ పీహెచ్‌సీలో వైద్య సేవలు పూర్తి స్థాయిలో అందిస్తామన్నారు. ఇదే సమయంలో గ్రామ సర్పంచ్ జామి రమణబాబు, స్థానికులు డీఎంహెచ్‌వోను కలిసి ప్రధాన వైద్యాధికారి ప్రసాదుపాత్రుడు సక్రమంగా విధులకు హాజరు కావట్లేదని, గతంలో ఇక్కడ ప్రసవాలు, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు, ఎక్కువగా జరిగేవని, ఇపుడు వైద్యసేవలు అంతంత మాత్రంగానే అందుతున్నాయని ఫిర్యాదు చేశారు. దీనిపై డీఎంహెచ్‌వో స్పందిస్తూ రెండవ వైద్యాధికారి రవితేజ వచ్చాక అంతా సర్దుకుంటుందని భరోసానిచ్చారు. సర్పంచ్‌తో పాటు ఉప సర్పంచ్ కాళ్ల జగన్, మాజీ సర్పంచ్ పెంటకోట అప్పారావు, స్థానిక నాయకులు మళ్ల కన్నబాబు తదితరులు వైద్య సిబ్బంది పనితీరు పట్ల డీఎంహెచ్‌వోకు ఏకరువు పెట్టారు.

స్కానింగ్ మిషన్ పాడైనప్పటికీ మరమ్మతులు చేయించలేదని మాజీ సర్పంచ్ పెంటకోట అప్పారావు చెప్పారు. అనంతరం వైద్యాధికార్లు, ఇతర సిబ్బందితో డీఎంహెచ్‌వో మాట్లాడారు.

ఫిబ్రవరి 15 నాటికి శతశాతం ఈ–క్రాప్ నమోదు



వ్యవసాయ సలహా మండలి సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, చిక్కాల రామారావు

- వ్యవసాయ సలహా మండలి సమావేశంలో కలెక్టర్

తుమ్మపాల : ఈ–క్రాప్ నమోదు ఫిబ్రవరి 15 నాటికి శతశాతం పూర్తి కావాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ఆయన మాట్లాడుతూ పీఎం కిసాన్ నమోదు కూడా త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం(ఇంటర్నేషనల్ మిల్లెట్ ఇయర్) సందర్భంగా చిరుధాన్యాల సాగు విస్తరణకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. తృణ ధాన్యాల ఉపయోగం, లాభసాటి సాగు గురించి రైతులకు వివరించాలని తెలిపారు. పశువుల బీమా ప్రయోజనాలు అర్హులైన రైతులందరికి అందించాలన్నారు. రంగు మారిన ధాన్యం కొనుగోలు, పశువైద్యశాలల్లో ఔషధాల నిర్వహణ, వ్యవసాయ పంటలపై విద్యుత్ తీగల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, జీడిమామిడి సస్యరక్షణ చర్యలపై సమీక్షలో మాట్లాడారు. సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు ఏప్రిల్, మే నెలల్లో కూడా కొనసాగించాలని, ఈ విషయమై ప్రభుత్వానికి నివేదించాలని కోరారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ పౌరసరఫరాల శాఖ ప్రధాన కార్యాలయానికి ఇప్పటికే అభ్యర్థన పంపించామని, వీలైనంత త్వరగా రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్టు పేర్కొన్నారు. కొన్ని రైస్ మిల్లర్లు పూర్తి మద్దతు ధర ఇవ్వడంలో రైతులకు ఇబ్బందులు కలిగిస్తున్నారని సలహా మండలి సభ్యులు తెలిపారు. ఉద్యాన వన పురుగు మందులు అందుబాటులో ఉంచాలని కోరారు. జిల్లా వ్యవసాయ అధికారి మోహనరావు, ఉద్యానశాఖ అధికారి ప్రభాకరరావు, డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి, పౌరసరఫరాల సంస్థ డీఎం శ్రీలత పాల్గొన్నారు.

స్టాఫ్ నర్సుల ఎంపికలో అక్రమాలు?

- చక్రం తిప్పిన ఇద్దరు ఉద్యోగులు
- అభ్యర్థుల నుంచి భారీగా వసూళ్లు!
- ఓ జాబితాలో ఉన్న పేరు.. మరో జాబితాలో గల్లంతు
- విచారణ చేపట్టాలని నిరుద్యోగుల డిమాండ్

మహారాణిపేట(విశాఖ దక్షిణ): స్టాఫ్ నర్సు పోస్టుల ఎంపిక ప్రక్రియ అక్రమాలకు అడ్డాగా నిలిచింది. వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయంలో పనిచేస్తున్న ఇద్దరు ఉద్యోగులు చక్రం తిప్పి అక్రమాలకు పాల్పడినట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిరుద్యోగ అభ్యర్థుల నుంచి రూ.3 లక్షల నుంచి రూ.4లక్షల చొప్పున వసూలు చేసినట్లు సమాచారం. కొంత మంది అభ్యర్థులకు ఉద్యోగాలతోపాటు అనుకున్న ప్రాంతంలో పోస్టింగ్ వచ్చే విధంగా చేస్తామని వారి నుంచి భారీగా దండుకున్నట్లు తెలిసింది. ఆ ఇద్దరు నిర్వాకం వల్ల దరఖాస్తు చేసిన అభ్యర్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఓ జాబితాలో పేరు ఉండడం, మరో జాబితాలో పేరు లేకపోవడం వంటి సంఘటనలు చోటు చేసుకున్నాయి. అనుకోకుండా పోస్టులు పెరగడం, కోవిడ్ సమయంలో పనిచేసిన వారికి వెయిటేజ్ మార్కులు కలపడం వంటి చర్యలు ఆ ఇద్దరి ఉద్యోగులకు కలిసి వచ్చాయి. దీంతో తమకున్న పరిచయాల ద్వారా ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన అభ్యర్థుల నుంచి భారీగా డబ్బులు సేకరించినట్లు తెలిసింది. వీరికి అదే శాఖలో అధికారులు పూర్తి సహాయ సహకారాలు అందించడం వల్ల జాబితాలో అనర్హులకు చోటు దక్కింది. అవసరం అయిన వారికి వెయిటేజ్ మార్కులు కలపకపోవడం, ఎలాంటి అర్హతలు లేని వారికి మార్కులు కలిపి అందలం ఎక్కించడం వంటి చర్యతో తుది జాబితా తప్పులు తడకలతో నిండిపోయింది.



ప్రిన్సిపల్ ట్రైనింగ్ స్కూల్ ఎదుట ఆందోళన చేస్తున్న అభ్యర్థులు

అభ్యర్థుల ఆందోళన

జాబితా ప్రకారం మొత్తం 172 మంది అభ్యర్థులు కౌన్సెలింగ్‌కు రావాల్సి ఉంది. కానీ మొదటి, రెండో, మూడో జాబితాలో పేర్లు ఉన్న అభ్యర్థులు శుక్రవారం ట్రైనింగ్ స్కూల్ ప్రిన్సిపల్ కార్యాలయానికి తరలివచ్చారు. మొత్తం 400 మందికి పైగా అభ్యర్థులు కౌన్సెలింగ్ జరగకుండా అడ్డుపడ్డారు. అనర్హులతో నిండిన జాబితా విడుదల చేశారని.. అర్హులకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు. అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎంపికైన అభ్యర్థులను లోపలకు వెళ్లకుండా అడ్డుకున్నారు. దీంతో అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన, కౌన్సెలింగ్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అరుపులు, కేకలతో ఆ ప్రాంతం దద్దరిల్లింది. చివరకు పోలీసులు రంగ ప్రవేశం చేసి అభ్యర్థులను అదుపు చేశారు. మధ్యాహ్నం రెండు గంటల తర్వాత కౌన్సెలింగ్ ప్రారంభమైంది. 17న నిర్వహించిన కౌన్సెలింగ్ సమయంలో నిరుద్యోగ అభ్యర్థులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేయడంతో.. అమరావతి నుంచి వైద్య ఆరోగ్యశాఖాధికారులు రంగంలోకి దిగి ప్రభుత్వ జీవో, రోస్టర్ పాయింట్ల ప్రకారం కొత్త జాబితా రూపొందించారు.

కొంప ముంచిన రహస్యం

పోస్టుల భర్తీ ప్రక్రియలో మొదటి నుంచి అన్ని రహస్యంగా ఉంచడం వల్ల పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయంలో సిబ్బంది వివరాలు బయటకు చెప్పడానికి ఇష్టపడే వారు కాదు. ఆ కార్యాలయంలోని ఇద్దరు, ముగ్గురు ఉద్యోగుల మొత్తం జాబితాను సిద్ధం చేసి.. వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ వద్దకు తీసుకెళ్లారు. 179 పోస్టులకు 172 మందితో జాబితా విడుదల చేశారు. మిగిలిన పోస్టులు ఎందుకు పెండింగ్‌లో ఉంచారన్న దానిపై పొంతన లేని సమాధానాలు చెప్పుకొచ్చారు. సరైన సమాచారం లేకపోవడం వల్ల శుక్రవారం జరిగిన కౌన్సెలింగ్‌కు 36 మంది అభ్యర్థులు హాజరు కాలేకపోయారు. మొత్తం 179 పోస్టులకు గానూ 172 మందితో జాబితా ప్రకటించారు. ఏడు పోస్టులకు అభ్యర్థులు లేకపోవడం వల్ల పెండింగ్‌లో పెట్టారు. అర్హులైన అభ్యర్థులు లేకపోవడం వల్ల పెండింగ్‌లో పెట్టినట్లు చెప్పారు.

136 మంది హాజరు

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ ఆవరణలోని ట్రైనింగ్ స్కూల్ ప్రిన్సిపల్ కార్యాలయంలో అభ్యర్థుల ఆందోళనల మధ్య.. ఎట్టకేలకు స్టాఫ్ నర్సుల భర్తీ ప్రక్రియ కొనసాగింది. మొత్తం 179 పోస్టులకు గానూ 172 మంది అభ్యర్థులతో జాబితా ప్రకటించగా.. 136 మంది అభ్యర్థులు కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. ఎనిమిది మంది పోస్టుల్లో చేరేందుకు అయిష్టత చూపిస్తూ లేఖలు ఇచ్చారు. 36 మంది అభ్యర్థులు కౌన్సెలింగ్‌కు హాజరు కాలేదని వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ డైరెక్టర్(ఆర్డీ) ఉమాసుందరి తెలిపారు. కౌన్సెలింగ్ పూర్తి చేసిన వారికి నియామక ఉత్తర్వులు అందజేసినట్లు చెప్పారు.

హెచ్‌పీసీఎల్ స్థల ఆక్రమణదారులకు నోటీసులిస్తాం

• స్పెషల్ డిప్యూటీ కలెక్టరు భీష్మానందం



హెచ్‌పీసీఎల్ పైపులైను స్థలాన్ని మ్యాప్‌లో చూపిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టరు భీష్మానందం

నాతవరం: హెచ్‌పీసీఎల్ పైపులైను భూముల్లో కట్టడాలు, మొక్కలు పెంచడం వంటి పనులు చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని స్పెషల్ డిప్యూటీ కలెక్టరు ఎస్ భీష్మానందం హెచ్చరించారు. మండలంలోని ఎం.బి.పట్నం, ఎ.శరభవరం గ్రామాల్లో హెచ్‌పీసీఎల్ పైపులైన్‌తోపాటు అక్కడున్న పాయింటును శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ మేరకు స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ పి.కనకారావుతో సమావేశమయ్యారు. అనంతరం స్పెషల్ డిప్యూటీ కలెక్టరు మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో విశాఖపట్నం నుంచి సికింద్రాబాద్ వరకు 575 కిలోమీటర్ల మేర హెచ్‌పీసీఎల్ పైపులైను ఉందన్నారు. ఈ పైపులైను ఖాళీ భూమిలో కొంత మంది ఆక్రమించుకుని విలువైన శాశ్వత కట్టడాలు, భారీ వృక్షాలు పెంచుతున్నారన్నారు. వీరికి నోటీసులు జారీ చేస్తామని, అప్పటికి స్పందించకపోతే పోలీసు కేసు పెట్టి జేసీబీతో కూల్చేస్తామన్నారు. ఎం.బి.పట్నంలో కొందరికి నోటీసులు ఇస్తామన్నారు. ఆర్ఐ నారాయణరావు, వీఆర్వో అప్పారావు ఉన్నారు.

క్రికెట్ ఆడుదాం.. ప్రతిభ చాటుదాం

ఈ నెల 22 సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ ఎంట్రీలకు చివరి తేదీ

SAKSHI
SAKSHI DIGITAL
MEDIA GROUP

SPL
SAKSHI PREMIER LEAGUE

బ్యాట్ పట్టుకొని బంతిని బౌండరీ దాటించాలని ఉందా? బుల్లెట్ వేగంతో బంతులు వేస్తూ వికెట్లను గిరాటేయాలని ఉందా? మెరుపు వేగంతో కదులుతూ బ్యాటర్లను రనౌట్ చేయాలని ఉందా? క్రికెట్ ఆడేద్దామని.. మనలోని ప్రతిభను ప్రపంచానికి చాటి చెప్పాలని మనసులో బలమైన కోరిక ఉంటే సరిపోదు.. దానికి వేదిక కూడా కావాలిగా! ఇలాంటి ఔత్సాహిక క్రికెటర్లు తమ కలలు నెరవేర్చుకునేందుకు మళ్లీ సమయం వచ్చేసింది. మరో ఆలోచన లేకుండా ముందుగా మీ జట్టును తయారు చేసుకొని ఎంట్రీలు పంపించండి.. ఆ తర్వాత సమరానికి సై అనండి.

District sponsor

CMR SHOPPING MALL
The joy of life
ANDHRAPRADESH | TELANGANA

ఔత్సాహిక క్రికెటర్లకు సువర్ణావకాశాలు కల్పించాలనే సదుద్దేశంతో సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో ఈ నెల(జనవరి) నాలుగో వారంలో సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) క్రికెట్ టోర్నీ నాలుగో సీజన్ మొదలుకానుంది. డిస్ట్రిక్ట్ స్పాన్సర్‌గా సీఎంఆర్ షాపింగ్‌మాల్ వ్యవహరిస్తోంది.

టోర్నీ ఫార్మాట్..

ముందుగా జిల్లా, ప్రాంతీయ, రాష్ట్ర స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు జరుగుతాయి. ఈ మ్యాచ్‌లను 10 ఓవర్లపాటు నిర్వహిస్తారు. జిల్లా స్థాయిలో విజేతగా నిలిచిన జట్లు ప్రాంతీయ స్థాయి టోర్నీకి అర్హత సాధిస్తాయి. ఈ మ్యాచ్‌లను 20 ఓవర్లపాటు నిర్వహిస్తారు. ప్రాంతీయ స్థాయి టోర్నీ విజేతలు రాష్ట్ర స్థాయిలో రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో టైటిల్ కోసం తలపడతాయి. ఉమ్మడి జిల్లాలే ప్రాతిపాదికగా ఎంట్రీలు స్వీకరిస్తారు.

ఎంట్రీ ఫీజు..

ఈ టోర్నీలో పాల్గొనాలనుకునే జట్లు రూ.1,500 ఎంట్రీ ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ మొత్తాన్ని ఆన్‌లైన్‌లోనూ, ఆఫ్‌లైన్ పద్ధతిలోనూ చెల్లించవచ్చు. వివరాలకు సాక్షి జిల్లా యూనిట్ కార్యాలయంలో సంప్రదించాలి. https://www.arenaone.in/registration వెబ్‌సైట్‌లోనూ వివరాలు లభిస్తాయి. ఎంట్రీలను ఈ నెల 22తేదీలోపు పంపించాలి.

ఏ ఏ విభాగాల్లో...

ఈ లీగ్‌ను రెండు కేటగిరీల్లో నిర్వహిస్తారు. అండర్-19 జూనియర్ స్థాయిలో (1 జనవరి 2003 తర్వాత జన్మించి ఉండాలి). అండర్-25 సీనియర్ స్థాయిలో (1 జనవరి 1997 తర్వాత జన్మించి ఉండాలి) వేర్వేరుగా నిర్వహిస్తారు.

జూనియర్ స్థాయిలో ఆడేందుకు జూనియర్ కాలేజీ జట్లకు, సీబీఎస్‌ఈ స్కూల్ (ప్లస్ 1, 2) జట్లకు, ఐటీఐ, పాలిటెక్నిక్ జట్లకు అర్హత ఉంది. సీనియర్ స్థాయిలో ఆడేందుకు డిగ్రీ, పీజీ, మెడిసిన్, ఇంజనీరింగ్, ఫార్మా కాలేజీ జట్లకు అవకాశం కల్పిస్తారు.

ఎన్ని జట్లకు అవకాశం..

ఒక్కో కాలేజీ నుంచి గరిష్టంగా రెండు జట్లను పంపించే వెసులుబాటు ఉంది. రెండు జట్లు కూడా వేర్వేరుగా ఎంట్రీ ఫీజు చెల్లించాలి. ఒక జట్టులో ఆడే ఆటగాడు మరో జట్టుకు ఆడకూడదు. మ్యాచ్‌లు ఆడే సమయంలో ఆటగాళ్లు వయసు ధ్రువీకరణ పత్రాలను చూపించాల్సి ఉంటుంది. మ్యాచ్ సమయంలో ఇరుజట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్) చూపించాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్స్, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్‌లు, అండర్ గార్డ్స్, హ్యాండ్ గ్లౌవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూస్ ధరించాలి.

ఇతర వివరాలకు నిర్వాహకులను సంప్రదించాల్సిన ఫోన్ నంబర్ : 70757 09205

గమనిక: అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

దళితులపై దాడి చేసిన దోషుల్ని అరెస్టు చేయాలి

తుమ్మపాల : నక్కపల్లి మండలం ఉద్దండపురం దళితులపై దాడి ఘటనలో లోతైన దర్యాప్తు జరిపి దోషులను అరెస్టు చేయకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని విశాఖ దళిత సంఘం ఐక్యవేదిక కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు అన్నారు. కలెక్టరేట్ గేటు వద్ద శుక్రవారం బాధితులతో కలిసి నిరసన చేసి దోషులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఘటన ఆధారంగా సెక్షన్లతో కేసులు నమోదు చేసి దళితులకు న్యాయం చేయాలని ఎస్సీ కమిషన్ చైర్మన్ ఇచ్చిన ఆదేశాలను గౌరవించాలన్నారు. అంతకుముందు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఐక్యవేదిక సభ్యులు ఎస్.ఆర్.వేమన, కె.హరిబాబు, మద్ర చంద్రశేఖర్, డి.నిర్మాల, ఎస్.నూకరాజు, పి.రమేష్, గంగరాజు, పాల్గొన్నారు.

నాడు - నేడు తో పాఠశాలల అభివృద్ధి

• జిల్లా కలెక్టర్ రవి పట్టాన్ శెట్టి

పాయకరావుపేట : జిల్లాలో నాడు –నేడు పథకం ద్వారా పాఠశాలలు అభివృద్ధి చెందుతున్నాయని, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు రూపుదిద్దుకుంటున్నాయని జిల్లా కలెక్టర్ రవి పట్టాన్ శెట్టి అన్నారు. ఆయన శుక్రవారం పట్టణంలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాల్లో 1000కి పైగా పాఠశాలలు నాడు – నేడు పథకం ద్వారా అభివృద్ధి చెందుతున్నాయన్నారు. నాడు – నేడు మొదటి విడతలో పాఠశాల్లో మరమ్మతులు, మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రెండవ విడతలో అదనపు గదులు నిర్మాణం, అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. అనంతరం పాఠశాల్లో మొదటి విడత 49 లక్షలతో చేపట్టిన చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. రెండవ విడతలో 59 లక్షలతో నిర్మిస్తున్న 4 గదులను పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకం, జగనన్న గోరుముద్దను తిని పరిశీలించారు. విద్యార్థులతో మమేకమై పరీక్ష పత్రాలను పరిశీలించారు. మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయాలన్ని పరిశీలించారు. సమస్యల పై పాఠశాల ఉపాధ్యాయుల్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాలికల ఉన్నత పాఠశాలను పరిశీలించి, మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. ఇటీవల జరిగిన పరీక్షలు ఫలితాలపై ఉపాధ్యాయుల్ని అడిగి తెల్సుకున్నారు. ఈయనతో పాటు జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు, డిఈవో ప్రేమ్ కుమార్, ఏపీఈడబ్ల్యు ఐడీసీ ప్రసాద్, ఎంఈవో కె.ఎస్.గాంధీ, ఈవోఆర్డీ సిహెచ్.చంద్రశేఖర్, హెచ్ఎమ్ కె.నరేష్ పాల్గొన్నారు.



గోరుముద్దను రుచి చూస్తున్న కలెక్టర్ రవి పట్టాన్ శెట్టి

టీడీపీ మహిళా కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరిక

చోడవరం: పట్టణంలోని 8వ వార్డు పిల్లావారితోటకు చెందిన అందే నాగలక్ష్మితోపాటు 30 మంది మహిళా కార్యకర్తలు శుక్రవారం వైఎస్సార్‌సీపీలో చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనకు ఆకర్షితులై పార్టీలో చేరినట్టు వీరంతా తెలిపారు. ఎర్రబాల సత్య, పి. లక్ష్మి, సయ్యపురెడ్డి వరలక్ష్మి, అమ్మేటి చంద్రవతి, కొమ్మోజి రామలక్ష్మి, భారతి, అప్పికొండ అంబిక, రాజా, చుక్కా నాగమణి, అప్పికొండ పద్మావతి, రమణమ్మ, వెంకటసూర్యనారాయణ, చిక్కాల కుమారి, కర్రి, జ్యోతి, పప్పు దేవి, ముచ్చల రమణ, తదితరులు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. వీరికి ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. అంకిత భావంతో పనిచేసే వారికి పార్టీలో తప్పనిసరిగా గుర్తింపు ఉంటుందన్నారు. మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఓరుగంటి నెహ్రూ, వైఎస్సార్‌సీపీ నాయకులు శీలం సత్తిబాబు, దూది సత్తిబాబు, జుంజూరి అప్పారావు, పందిరి శ్రీనివాసరావు, గూనూరు రామకృష్ణ, గూనూరు చిన అచ్చిబాబు, బొడ్డు శ్రీరామ్మూర్తి, కోరుకొండ సత్తిబాబు పాల్గొన్నారు.



టీడీపీ కార్యకర్తలకు పార్టీ కండువాలు వేసి ఆహ్వానిస్తున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

మద్యం షాపుల్లో అవకతవకలకు పాల్పడితే తొలగిస్తాం

నాతవరం: ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పని చేసే సిబ్బంది ఎలాంటి అవకతవకలకు పాల్పడినా, వెంటనే విధుల నుంచి తొలగిస్తామని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారి ఎస్.వి.రమణ హెచ్చరించారు. నాతవరం, ఎం.బి.పట్నం, డి.యర్రవరం మద్యం దుకాణాలను ఆయన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని 24 మండలాల్లో 148 మద్యం షాపుల్లో 148 మంది సూపర్‌వైజర్లు, 350 మంది సెల్స్‌మెన్లతోపాటు నైట్ వాచ్‌మెన్లు పని చేస్తున్నారన్నారు. మద్యం షాపుల్లో స్టాకుతోపాటు ఇతర విషయాల్లో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. వినియోగదారులకు అవసరమైన బ్రాండ్లు సిద్ధంగా ఉన్నాయన్నారు.

విద్యుదాఘాతంతో కార్మికుడి మృతి

• ఫాల్‌జీ ఇటుకల పరిశ్రమలో దుర్ఘటన

చోడవరం రూరల్ : ఫాల్జీ ఇటుకల పరిశ్రమలో పని చేయడానికి వచ్చిన తొలిరోజే ఆ కార్మికునికి చివరిరోజు అయ్యింది. విద్యుదాఘాతం రూపంలో ఉసురు తీసింది. భార్య, ఇద్దరు పిల్లలను అనాథలుగా మిగిల్చింది. శుక్రవారం మధ్యాహ్నం సంభవించిన ప్రమాదం వివరాలు ఇలాఉన్నాయి. మండలంలోని లక్ష్మీపురం రెవెన్యూ పరిధి చోడవరం-వడ్డాది మెయిన్ రోడ్డును ఆనుకుని ఉన్న కృష్ణవేణి ఫాల్‌జీ ఇటుకల పరిశ్రమలో శుక్రవారం మధ్యాహ్నం సుమారు ఒంటిగంట సమయంలో ప్రమాదం చోటు చేసుకుంది. వి.మాడుగుల మండలం వీరనారాయణం గ్రామానికి చెందిన నలభై ఏళ్ల పైబడిన పీలా ఆదిబాబు సిమెంట్ ఇటుకల పోత పనిలో ఉండగా మిక్సర్ మిషన్‌ను ఆపరేట్ చేయబోగా విద్యుత్ ఘాతానికి గురయ్యాడు. తోటి కార్మికులు పరిశ్రమ యజమాని సంబంధీకులు కరెంట్ సరఫరాను నిలిపివేసి ఆదిబాబును రక్షించే ప్రయత్నం చేశారు. అయితే అప్పటికే అతడు మృతి చెందినట్టు గుర్తించారు. అయితే ఆదిబాబుది సహజ మరణమని మృతి వార్త తెలుసుకుని వీరనారాయణం గ్రామం నుంచి వచ్చిన అతడి బంధువులతో పరిశ్రమ యజమాని నమ్మబలికారు. అయితే అతడితో పాటు పనిలోకి వచ్చిన అదే గ్రామానికి చెందిన వారు ప్రమాదం గురించి చెప్పడంతో అక్కడికి చేరుకున్న చోడవరం ఎస్ఐ బి.అప్పలనాయుడు పరిశ్రమను ఆనుకుని ఉన్న యజమాని ఇంటిలోని సీసీ కెమెరా ఫుటేజీని పరిశీలించడంతో వాస్తవం వెలుగు చూసింది.



ఆదిబాబు మృతదేహం వద్ద రోదిస్తున్న భార్య, బంధువులు

తొలిరోజే ఆయువు తీరిపోయింది...

మృతుడు ఆదిబాబు తన స్వగ్రామం వీరనారాయణం సమీపంలో ఉన్న దొర్ల సురవరం గ్రామంలోని ఫాల్‌జీ ఇటుకల పరిశ్రమలో గురువారం వరకు పని చేసేవాడు. శుక్రవారం నుంచి ఇక్కడ పనికి వచ్చాడని, వచ్చిన తొలిరోజే అతని ఆయువు తీరిపోయిందంటూ మృతుడి భార్య వెంకటలక్ష్మి రోధించడం పలువురిని కంట తడి పెట్టించింది. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

వీరనారాయణంలో విషాదఛాయలు

మాడుగుల రూరల్ : చోడవరం సమీపంలో సిమెంటు ఇటుకలు తయారీ పరిశ్రమలో విద్యుదాఘాతానికి గురై శుక్రవారం మృతి చెందిన పీలా ఆదిబాబు స్వగ్రామం మండలంలో వీరనారాయణం గ్రామం. ఆయనకు భార్య వెంకటలక్ష్మి, తల్లి ఆదిలక్ష్మి, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆదిబాబు కుమారులు పవన్‌కుమార్ డిగ్రీ, మణికంఠ ఇంటర్ మాడుగులలో చదువుతున్నారు. రెక్కాడితే గాని డొక్కాడని ఆదిబాబు కుటుంబంలో విషాదచాయలు అలముకున్నాయి.

తాతయ్య సంవత్సరీకానికి వచ్చి.. తిరిగిరాని లోకాలకు

కోటవురట్ల : తాతయ్య సంవత్సరీకానికి కుటుంబ సభ్యులతో కలిసి వచ్చిన ఓ బాలుడు తిరిగిరాని లోకాలకు వెళ్లి కన్నవారికి కన్నీటిని మిగిల్చాడు. యండపల్లి శివారున శివాలయం వద్ద ఆలయ ధర్మకర్త కుటుంబం నివసిస్తోంది. ఆలయ ధర్మకర్త శివరామశర్మ కొన్నాళ్ల క్రితం మరణించారు. ఆయన సంవత్సరీకం సందర్భంగా కాకినాడలో ఉంటున్న కుమార్తె లలిత, అల్లుడు వెంకటేశ్వరస్వామి తమ ఇద్దరు పిల్లలతో కలిసి రెండు రోజుల క్రితం వచ్చారు. గురువారం కుటుంబ సభ్యులంతా కలిసి సంవత్సరీకం పూర్తి చేశారు. తిరిగి శుక్రవారం ఎవరి ఇళ్లకు వారు వెళ్లిపోయేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇంతలో శివరామశర్మ మనువడు గోపా వరహాల నాగ భార్గవ రామశర్మ (16) వరాహనది వద్దకు వెళ్లి ఎంతకూ తిరిగి రాకపోవడంతో వెళ్లి చూసేసరికి నది ఒడ్డున చెప్పులు కనిపించాయి. ఆందోళనతో రామశర్మ మొబైల్‌కు కాల్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. దాంతో నీటిలో ప్రమాదవశాత్తూ జారిపడి మునిగిపోయి ఉంటాడని గుర్తించి భయంతో కేకలు వేశారు. స్థానికులు వచ్చి నీటిలో వెతికినా ఫలితం లేకపోయింది. దాంతో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్ఐ నారాయణరావు పరిశీలించి బి.కె.పల్లికి చెందిన నలుగురు గజ ఈతగాళ్లతో నదిలో వెతికించారు. విషయం తెలుసుకున్న తహసీల్దారు జానకమ్మ సంఘటన స్థలానికి చేరుకుని బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. గజ ఈతగాళ్లు కొద్ది సేపటికి రామశర్మ మృతదేహాన్ని గుర్తించి నదిలో నుంచి బయటకు తీశారు. దాంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. శివయ్యా నా బిడ్డను బతికించు తండ్రీ అంటూ తండ్రి వెంకటేశ్వరస్వామి రోదన అందరినీ కన్నీరుపెట్టించింది. తండ్రి వెంకటేశ్వరస్వామి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు.



కుమారుడి మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లిదండ్రులు

క్లుప్తంగా

నేడు మంత్రి అమర్‌నాథ్ ముందస్తు జన్మదిన వేడుకలు

కశింకోట : స్థానిక పంచాయతీ కార్యాలయంలో శనివారం మధ్యాహ్నం 3 గంటలకు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ జన్మదిన వేడుకలు ముందస్తుగా నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి జన్మదినానికి ఒక రోజు ముందుగానే భారీ కేక్ కట్‌చేసి పార్టీ శ్రేణులకు పంచిపెట్టనున్నట్లు పేర్కొన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, పార్టీ శ్రేణులు, మహిళలు, అభిమానులు హాజరు కావాలని కోరారు.

రహదారి భద్రతపై అవగాహన ర్యాలీ



నరసింగబిల్లిలో విద్యార్థుల మానవహారం

కశింకోట : మండలంలోని నరసింగబిల్లిలో శుక్రవారం రహదారి భద్రతపై అవగాహన కలిగిస్తూ విద్యార్థులు, ప్రజలు మానవహారం ర్యాలీ నిర్వహించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, నాలుగు చక్రాల వాహనదారులు తప్పనిసరిగా సీట్ బెల్ట్ ధరించాలని కోరారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం శిక్షార్హమన్నారు. వెలుగు ఏపీవో ఎస్. శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి మేరీజోన్స్, ఉపాధ్యాయులు, వెలుగు సీసీ శ్రీను, సచివాలయ సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

కృష్ణంరాజు జయంతి వేడుకలు

అనకాపల్లిటౌన్ : స్థానిక విజయ రెసిడెన్సీలో శుక్రవారం దివంగత సినీ నటుడు కృష్ణంరాజు జయంతి వేడుకలు జరిగాయి. ఏపీ వెంకటేష్ అభిమాన సంఘం, హెల్పింగ్ హ్యాండ్స్ కన్వీనర్ పి.చందు కేక్ కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో సినీ హీరో ప్రభాస్ అభిమానులు పాల్గొన్నారు.

'గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలు పాటించాలి'

పరవాడ: బ్రాండెక్స్ పరిశ్రమలో విష వాయువు లీకేజీ బాధితులకు రూ.లక్ష చెల్లించాలని గ్రీన్ ట్రిబ్యునల్ ఇచ్చిన ఆదేశాలను తక్షణమే అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. పరవాడలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు.

బెల్లం ధరలు

అనకాపల్లి మార్కెట్‌కు శుక్రవారం 3,821బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్	3,520	4,060
మొదటి రకం	3,070	3,440
రెండో రకం	2,850	3,260
మూడో రకం	2,730	2,820

అనకాపల్లి సినిమాలు

ధమాకా	- రాజా
వాల్తేరు వీరయ్య	- సత్యనారాయణ స్క్రీన్-1
వీర సింహారెడ్డి	- సత్యనారాయణస్క్రీన్-2
18 పేజెస్	- షిర్డిసాయి
వాల్తేరు వీరయ్య	- పర్తిసాయి
వీర సింహారెడ్డి	- వెంకటేశ్వర
లవ్ టుడే	- శ్రీసత్య
వాల్తేరు వీరయ్య	- రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 37 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-10 యూనిట్లు, ఏ నెగిటివ్-2 యూనిట్లు, బీ పాజిటివ్-3 యూనిట్లు, బీ నెగిటివ్-2 యూనిట్లు, ఓ పాజిటివ్-18 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9182834480)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 437 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న 397 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (9441108144)ని సంప్రదించవచ్చు.

గౌరమ్మ ఉత్సవానికి వేళాయె..!

- నేడు వేల్పుల వీధి గౌరీపరమేశ్వరుల ఉత్సవం
- భారీగా తరలి రానున్న భక్తులు, సందర్శకులు



గౌరీపరమేశ్వరులు



ఆకట్టుకుంటున్న ఆర్‌ఆర్‌ఆర్ లైట్ సెట్టింగ్

అనకాపల్లిటౌన్ : వేల్పులవీధి గౌరీ పరమేశ్వరుల ఉత్సవానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. శనివారం జరగనున్న ఈ ఉత్సవానికి చుట్టుపక్కల మండలాల నుంచి సుమారు 3 లక్షల మంది భక్తులు, సందర్శకులు తరలిరానున్నట్టు అంచనా. దీంతో ఎవరికీ ఎలాంటి ఇబ్బందుల్లేకుండా ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది.

వందేళ్ల చరిత్ర

స్వర్గీయ కొమ్మాన నర్సింగరావు తన భార్య పార్వతమ్మపై ప్రేమతో కొంత స్థలంలో అమ్మవారి ఆలయాన్ని నిర్మించాలని భావించారు. ఈ మేరకు 1920లో ఓ పాకలో గౌరమ్మను ప్రతిష్ఠించారు. వేల్పుల నూకాలమ్మ కుటుంబం అమ్మవారిని నిత్యం పూజించేది. డిసెంబర్ మూడో వారంలో వేల్పులవీధి కుటుంబీకులు అమ్మవారి ఉత్సవాన్ని నిర్వహించేవారు. అయితే అప్పట్లో జనం ఎక్కువగా వచ్చేవారు కాదు. అంతా సంక్రాంతి పండగ హడావుడి, వచ్చీపోయే చుట్టాలను సాగనంపే పనిలో ఉండిపోయేవారు. దీంతో అమ్మవారి ఉత్సవం వేల్పుల వీధికే పరిమితం కారాదని అప్పటి వీధి పెద్దలు వాకాడ దాలప్ప, రౌతు ఆదినారాయణ, బోయిన రమణ తదితరులు ఉత్సవాన్ని జనవరి మూడో శనివారానికి మార్చారు.

భారీగా ఉత్సవం

అప్పటి వరకు బుర్రకథలు, నేలవేషాలతో జరిగే ఉత్సవం 80వ దశకంలోకి వచ్చేసరికి భారీతనం చేరింది. గ్రామ పెద్దల సహాయ సహకారాలతో భారీ స్థాయిలో సంప్రదాయ సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ పెరిగింది. దీంతో దశలవారీగా గౌరీపరమేశ్వరుల ఉత్సవాల ఖ్యాతి పక్క మండలాలకు కూడా వ్యాపించింది. ప్రస్తుతం నేలవేషాలతోపాటు, సాంస్కృతిక కార్యక్రమాల కోసం భారీగా స్టేజీలను ఏర్పాటు చేశారు. ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన కళాకారులు, ఒడిశా, తమిళనాడు, కేరళ రాష్ట్రాల కళాకారులతో వివిధ రకాల నేలవేషాలు ఏర్పాటు చేశారు. దీంతో శనివారం అమ్మవారి ఉత్సవం కనుల పండువగా సాగనుంది.



అయోధ్య రామాలయం నమూనా సెట్టింగ్

మూడు రోజులపాటు ఊరేగింపు

అమ్మవారి ఊరేగింపు మొదట్లో వేల్పులవీధిలో మాత్రమే జరిగేది. ప్రస్తుతం మూడు రోజుల పాటు ఈ ఊరేగింపును పట్టణంలోని పురవీధులగుండా నిర్వహించనున్నారు. జాతర తొలి రోజైన శనివారం ఉదయం అమ్మవారి ఊరేగింపు ప్రారంభమై సోమవారం తెల్లవారు జామున స్థానిక శారదానదిలో అనుపు మహోత్సవం నిర్వహించడం ఆనవాయితీ.

మందుగుండు విన్యాసాల మోత

గౌరమ్మ ఉత్సవాలంటే ముందుగా గుర్తొచ్చేది గవరపాలెం మందుగుండు సీతారామయ్య మందుగుండు విన్యాసాలే. వివిధ ఆకృతుల్లో మందుగుండు సామగ్రిని ఏర్పాటు చేయడంతోపాటు వాటిని వెలిగిస్తే అవి చేసే విన్యాసాలను తప్పక చూడాల్సిందే. జాతర రోజు రాత్రి ఒంటి గంట సమయంలో మొదలై తెల్లవారుజాము 3 గంటల వరకు స్థానిక ఎన్టీఆర్ క్రీడా మైదానంలో బాణసంచా సందడి పట్టణాన్ని మారుమోగిస్తుంది.

రహదారులకు మరమ్మతులు



సుంకరమెట్ట కూడలి వద్ద రహదారి మరమ్మతు పనులు చేయిస్తున్న ఎస్‌ఐ రమేష్

అనకాపల్లిటౌన్ : పట్టణంలోని పలు ప్రాంతాల్లో గోతులమయంగా మారిన రహదారులకు మరమ్మతులు చేసినట్టు ట్రాఫిక్ ఎస్‌ఐ జె.రమేష్ చెప్పారు. స్థానిక సుంకరమెట్ట కూడలి వద్ద రహదారికి ఆర్‌అండ్‌బీ సహాయంతో గోతులు పడిన చోట పూడ్చివేత పనులు చేయించినట్టు తెలిపారు.

ఘనంగా గౌరీపరమేశ్వరుల 176వ ఊంజల్ సేవ

అనకాపల్లిటౌన్ : స్థానిక గౌరీ పంచాయతన దేవాలయంలో శుక్రవారం గౌరీపరమేశ్వరుల 176వ ఊంజల్ సేవ నేత్రపర్వంగా జరిగింది. ఆలయ అర్చకులు అంపోలు గోపాలకృష్ణ శర్మ ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గౌరీ పరమేశ్వరులకు భక్తితో పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యదర్శి బుద్ద రమణాజీ, ఆలయ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

డ్రంకన్ డ్రైవ్‌లో 14 మందిపై కేసులు



వాహనదారులతో మాట్లాడుతున్న సీఐ శ్రీను

అనకాపల్లిటౌన్ : మద్యంసేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 14 మందిపై కేసులు నమోదు చేసినట్టు ట్రాఫిక్ సీఐ టి.శ్రీను చెప్పారు. స్థానిక ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో శుక్రవారం వాహనదారులకు ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నపడం ద్వారా విలువైన జీవితాలు మధ్యలోనే ముగుస్తున్నాయన్నారు. మీతోపాటు మీ కుటుంబసభ్యులకు దూరమవడమేకాకుండా ఇతరులకు హాని కలిగించినవారవుతారని చెప్పారు. 14 మందికి కలిపి రూ.40 వేలు జరిమానా విధించినట్టు సీఐ తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ జె.రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

రథసప్తమి వేడుకల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీ సత్యవతి

అనకాపల్లిటౌన్ : ప్రశాంతమైన వాతావరణంలో రథసప్తమి వేడుకలు నిర్వహించాలని ఎంపీ సత్యవతి అన్నారు. ఎంపీ కార్యాలయంలో శుక్రవారం రథసప్తమి వేడుకల పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 28న జరిగే రాజుపాలెం సూర్యనారాయణ స్వామి రథసప్తమి వేడుకలకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధికసంఖ్యలో హాజరవుతారని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని ఆలయ చైర్మన్ కొణతాల బాబూరావుతోపాటు పాలకవర్గ సభ్యులకు ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ కర్రి కోటేశ్వరరావు, కార్యదర్శి గొల్లవిల్లి రామకోటేశ్వరరావు, కోశాధికారి గొల్లవిల్లి రామకృష్ణ ప్రసాద్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గృహ సారథుల ఎంపికపై కసరత్తు



గృహ సారథుల ఎంపికపై కసరత్తు చేస్తున్న పార్టీ నాయకులు

సబ్బవరం: మండలంలో గృహ సారథుల ఎంపికపై వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కర్రి బాబు ఆధ్వర్యంలో శుక్రవారం ఆ పార్టీ కార్యాలయంలో నాయకులు కసరసత్తు చేశారు. ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ ఆదేశాల మేరకు ఎంపిక ప్రక్రియ చేపట్టినట్టు కర్రి బాబు తెలియజేశారు. ప్రతి గ్రామ వలంటీర్ పరిధిలో ఇద్దరు గృహ సారథుల చొప్పున 700 మందికి పైగా గృహ సారథులను ఎంపిక చేయనున్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కొటాన రాము, మాజీ ఎంపీపీ సబ్బవరపు ముత్యాలనాయుడు, పార్టీ సీనియర్ నాయకులు బోకం రామునాయుడు, వనం అచ్చెంనాయుడు, పార్టీ మండల యువజన విభాగం అధ్యక్షుడు యడ్ల నాయుడు, బి. మహలక్ష్మినాయుడు, కొటాన రమణ తదితరులు పాల్గొన్నారు.

సీతారాముల తీర్థ మహోత్సవం నేడు



తాళ్లపాలెంలో విద్యుత్ దీపాలతో రూపొందించిన దేవతామూర్తుల ముఖద్వారం

కశింకోట : మండలంలోని తాళ్లపాలెంలో శనివారం సీతారాముల తీర్థ మహోత్సవాన్ని పెద్ద ఎత్తున నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. మండలంలో ఇదే ప్రధాన తీర్థమహోత్సవం కావడంతో గ్రామ కూడలి నుంచి రామాలయం వరకు విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు. రెండు ముఖ ద్వారాలను దేవతామూర్తుల కటౌట్లతో, విద్యుత్ వెలుగులతో తీర్చిదిద్దారు. ఆలయాన్ని విద్యుదీపాలతో అలంకరించారు. పిల్లలు, పెద్దలు ఆనందించడానికి రంగుల రాట్నాలు, ఆకాశ చక్రాలు, జారుడు బల్లలు తదితర ఏర్పాట్లు చేస్తున్నారు. తీర్థం పురస్కరించుకొని సాయంత్రం నుంచి రాత్రి వరకు నర్సీపట్నం రోడ్డులో వాహనాల రాకపోకల క్రమబద్ధీకరణకు పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు.

ఘనంగా తీర్థ మహోత్సవాలు

కశింకోట : మండలంలోని లాలంకొత్తూరు, సోమవరం గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం తీర్థ మహోత్సవాలు ఘనంగా జరిగాయి. దేవతామూర్తులను సంప్రదాయ నృత్యాలు, మేళతాళాలతో ఊరేగించారు. భజనలు, తోడపెద్దు సేవలు నిర్వహించారు. ఈ సందర్భంగా పంచదార చిలుకలు, తినుబండారాలు, ఆట వస్తువుల అమ్మకాలు జోరుగా సాగాయి. చుట్టు పక్కల గ్రామాల నుంచి ప్రజలు వచ్చి స్థానికులతోపాటు ఉత్సాహంగా పాల్గొన్నారు.

శివ సత్యం దొర మృతి పార్టీకి తీరని లోటు



శివసత్యం మృతదేహానికి నివాళి అర్పిస్తున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

అనకాపల్లి రూరల్: కుంచంగి ఎంపీటీసీ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పల్లెల శివ సత్యం దొర మృతి పార్టీకి తీరని లోటని పార్టీ జిల్లా అధ్యక్షుడు కరణం ధర్మశ్రీ అన్నారు. కుంచంగిలో అనారోగ్యంతో మృతి చెందిన శివ సత్యం దొర స్వగృహానికి వెళ్లి ఆయన పార్థివ దేహానికి పూలమాలలు వేసి ప్రభుత్వ విప్ ధర్మశ్రీ, రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్, అనకాపల్లి ఎంపీపీ గొర్లి సూరిబాబు శుక్రవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి శివ చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటామని భరోసానిచ్చారు. హుషారుగా ఉంటూ మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులను కలిసి ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేసేవారని పలువురు అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు గుర్తుచేసుకున్నారు. శివ సత్యం దొర కుమార్తె కుసుమకు ధైర్యం చెప్పారు. నివాళులర్పించినవారిలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ భీశెట్టి వరాహ సత్యవతి, భీశెట్టి జగన్, కలగా గున్నయ్యనాయుడు, గొల్లవిల్లి శ్రీనివాసరావు, కొణతాల రఘునాథ్, పల్లెల నాగేశ్వరరావు, అన్నపూర్ణ బ్యాంకు చైర్మన్ పీడీ గాంధీ, తుమ్మపాల సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు తదితరులు ఉన్నారు. అనంతరం అశ్రునయనాల మధ్య శివ సత్యం దొర భౌతిక కాయానికి గ్రామంలోని హిందూ శ్మశాన వాటికలో అంత్యక్రియలు పూర్తి చేశారు.

మార్కెట్ అభివృద్ధికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న పలకా యశోద

అనకాపల్లిటౌన్ : బెల్లం మార్కెట్ యార్డు అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేయనున్నట్టు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పలకా యశోద అన్నారు. స్థానిక మార్కెట్ ఆవరణలో శుక్రవారం 9వ సాధారణ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మార్కెట్ యార్డును అభివృద్ధి చేసేందుకు తీసుకోవలసిన చర్యలపై చర్చించినట్టు తెలిపారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ, మార్కెట్‌యార్డు నందు సీజన్ నడుస్తున్నందున రైతులకు, బెల్లానికి గిట్టుబాటు ధర దక్కేలా అధికారులను ఆదేశించామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి పలకా రవి, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు కరక సోమునాయుడు, సభ్యులు నీటిపల్లి లక్ష్మి, మర్రిపల్లి శోభ, బొబ్బిలి శ్యామల, ఈగల నూకరత్నం, దాడి కుమార్, గుండా రమేష్‌గుప్తా, గొంతిన శివ తదితరులు పాల్గొన్నారు.

కోడి పందాల్లో నలుగురు అరెస్టు

కశింకోట : మండలంలోని సుందరయ్యపేట గ్రామ శివారు లాలంకొత్తూరులో శుక్రవారం కోడి పందాలు నిర్వహిస్తున్న వారిపై దాడి చేసి ఇద్దరిని అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ ఎ.ఆదినారాయణరెడ్డి తెలిపారు. అరెస్టు చేసిన వారిలో రావాడ రాజు, గుడబండ రాజు ఉన్నారన్నారు. వారి నుంచి రూ.1000 నగదు, రెండు పందెం కోళ్లను స్వాధీనం చేసుకున్నట్టు పేర్కొన్నారు.

అనకాపల్లిటౌన్ : మండలంలో కోడి పందాలు ఆడుతున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్‌ఐ సీహెచ్ నరసింగరావు చెప్పారు. మండలంలోని కొండుపాలెం గ్రామం చివర కోడి పందాలు నిర్వహిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రెండు కోళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మురుగు కాలువలకు మహర్దశ

- మంత్రి అమర్‌నాథ్ ఆదేశాలతో అధికారుల చర్యలు
- జీజీఎంపీ నిధులతో ప్రతిపాదనల తయారీకి కసరత్తు



రహదారిపైకి వస్తున్న మురుగునీరు



తారకరామారావు కాలనీలో రహదారిపై పారుతున్న మురుగునీరు

అనకాపల్లిటౌన్ : మండలంలోని పలు గ్రామాల మురుగు కాలువలకు మహర్దశ పట్టనుంది. ఇటీవల మండలంలో గడప గడపకు మన ప్రభుత్వం(జీజీఎంపీ) కార్యక్రమంలో భాగంగా మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పర్యటించిన విషయం తెలిసిందే. ఈ పర్యటనలో స్థానికులు ఎక్కువగా పటిష్ట డ్రైనేజీ వ్యవస్థ గురించి మంత్రికి మొరపెట్టుకున్నారు. దీంతో సానుకూలంగా స్పందించిన మంత్రి, కాలువల నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాల్సిందిగా సంబంధింత అధికారులను ఆదేశించారు. అవసరమైన నిధుల మంజూరుకు హామీ ఇచ్చారు.

దుస్థితి.. దుర్గంధం

మండలంలోని వెంకుపాలెం, సీతానగరం, బవులవాడ, కూండ్రం, కొత్తూరు-1, తుమ్మపాల-1, ఊడేరు, మార్టూరు, అక్కిరెడ్డివానిపాలెం తదితర గ్రామాల్లో మురుగునీరు వెళ్లేందుకు కనీస ఏర్పాట్లు లేవు. చాలా చోట్ల రోడ్ల మీదుగానే మురికి నీరు ప్రవహిస్తోంది. దీంతో దుర్గంధం వ్యాపించి, దోమలు పెరిగి స్థానికులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై గత ప్రభుత్వాలకు మొరపెట్టుకున్నా.. స్పందించలేదు. తాజాగా మంత్రి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని చాలా గ్రామాల్లో ఇంటింటికీ తిరిగారు. ప్రభుత్వ పని తీరుపై సంతృప్తి వ్యక్తం చేస్తూనే.. ప్రజలు ఏళ్ల తరబడి తామెదుర్కొంటున్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించాల్సిందిగా మంత్రికి మొరపెట్టుకున్నారు.

గ్రామాలకు కొత్త కళ

గత ప్రభుత్వాల హయాంలో డ్రైనేజీ వ్యవస్థకు నోచుకోని గ్రామాలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మాత్రం పరిష్కారం దక్కనుంది. సంక్షేమ పాలన అందిస్తూనే.. స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తోంది. ప్రజల ఇక్కట్లు తెలుసుకునేందుకే జీజీఎంపీ కార్యక్రమాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గుర్తించిన చిన్న చిన్న సమస్యల్ని తక్షణమే పరిష్కరిస్తున్నారు. కాలువలు, రోడ్లు, సామాజిక భవనాలు తదితర అభివృద్ధి కార్యక్రమాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. సచివాలయాల వారీ ప్రత్యేక నిధులను కూడా కేటాయించింది. వీటితోపాటు అవసరమైన మేరకు అదనపు నిధులను రప్పించేందుకు తాను కృషి చేస్తానని మంత్రి అమర్‌నాథ్ భరోసా ఇవ్వడంతో తమ గ్రామాలకు కొత్త కళ రానుందని స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తమ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న మంత్రికి, సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి తామంతా ఎల్లప్పుడూ అండగా ఉంటామని, కృతజ్ఞతలు చెప్పుకుంటున్నారు.

అభివృద్ధి అంటే ఏంటో తెలుస్తోంది



మూడేళ్ల కాలంలో మా గ్రామంలో సచివాలయం నిర్మించారు. తర్వాత రైతు భరోసా కేంద్రం ఏర్పాటు చేశారు. దీంతో రైతులకు, సామాన్యులకు కూడా సచివాలయాల ద్వారా చాలా పనులు ఊరు దాటకుండానే పూర్తవుతున్నాయి. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలతోపాటు గ్రామాల అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తున్నారు. కాలువల నిర్మాణం పూర్తయితే.. మా ఊరు రూపురేఖలో మారిపోతాయి. అభివృద్ధి ఎలా ఉంటుందో.. ఇన్నేళ్లలో ఇపుడే మాకు తెలుస్తోంది.

– ధనలక్ష్మి,టి.ఆర్.కాలనీ

ప్రతిపాదనలు రూపొందిస్తున్నాం

నూతన డ్రైనేజీల నిర్మాణానికి నిధుల వ్యయంపై అంచనాలు రూపొందిస్తున్నాం. గ్రామాల వారీ కొలతలు తీస్తున్నాం. త్వరలో పూర్తిస్థాయి అంచనాలతో ప్రతిపాదనలు సిద్ధం చేస్తాం. ఇది పూర్తయ్యాక తుది నివేదికను మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు సమర్పిస్తా. ఆయన మార్పులేమైనా సూచిస్తే.. ఆ మేరకు నివేదిక సిద్ధం చేసి, ప్రభుత్వానికి పంపిస్తాం. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో అందిన సమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యతిస్తున్నాం.

– గంగాధరరావు,తహసీల్దార్

ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



ఆధార్ సేవలను పరిశీలిస్తున్న సర్పంచ్ మంగలక్ష్మి

మునగపాక : ప్రతి ఒక్కరూ ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని తిమ్మరాజుపేట సర్పంచ్ భీమిశెట్టి మంగలక్ష్మి కోరారు. తిమ్మరాజుపేట సచివాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ సేవలను ఆమె శుక్రవారం పరిశీలించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఆధార్ సేవలను వినియోగించుకోవాలన్నారు. ఉప సర్పంచ్ కాండ్రేగుల జగన్, అనిత కార్యక్రమంలో పాల్గొన్నారు.